
క్లుప్తంగా

విద్యార్థి దశ కీలకం

బిక్కవోలు: వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమని, అందులోనూ పాఠశాల స్థాయి నుంచి కళాశాలకు వెళ్లే దశకు అత్యంత ప్రాముఖ్యత ఉందని కొంకుదురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పదో తరగతి విద్యార్థులు నిర్వహించుకున్న ఫేర్వెల్ పార్టీలో పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవితంలో తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి సరైన మార్గాన్ని ఎంచుకుని తగిన కృషి చేయాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణసాయి, ఈశ్వరరెడ్డి, వలీషా, అప్పారావు, లక్ష్మణరెడ్డి, సుధాకరరెడ్డి, చౌదరి, రాజశేఖర్, శిరిష, కృష్ణజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం



ప్రత్యేక అలంకణలో మహాలక్ష్మి అమ్మవారు

పెదపూడి: గ్రామంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి వారి తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తీర్థానికి మండల నలుమూల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఏలాంటి రవాణా ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు చేశారు. స్థానికులు భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు ఉచితంగా సరఫరా చేశారు.

పలువురు వలంటీర్ల రాజీనామా



కాపవరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడికి చెందిన పలువురు వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వలంటీర్లపై విపక్ష నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు. గ్రామంలో నిస్వార్థ సేవలందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న వారిపై నిందారోపణలు చేయడం దుర్మార్గమన్నారు. రాజీనామా పత్రాలను కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ హేమసుందరరావుకు సమర్పించారు. కొద్దిసేపు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

నలుగురు యువకులపై కేసు నమోదు

సీతానగరం: పెద్దాపురం మండలం జి.రాగంపేటకు చెందిన కొండ్రు సునీల్‌ను కులం పేరుతో దూషించి, దాడి చేసినట్టు రఘుదేవపురానికి చెందిన నలుగురు యువకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్సై టి రామకృష్ణ బుధవారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. రఘుదేవపురంలో చింతాలమ్మ సిరికి మంగళవారం జి.రాగంపేట నుంచి సునీల్ తన స్నేహితుని ఇంటికి వచ్చాడు. సాయంత్రం తన బైక్‌పై తిరిగి వెళ్తుండగా, రెండు బైక్‌లపై వచ్చిన బొంగు సాయి, సిద్దా సాయి, సిద్దా కొటేష్, సూరి లక్ష్మణ్ సైడ్ ఇచ్చే విషయమై గొడవ పడ్డారు. కులం పేరుతో దూషించి, టైల్స్‌తో దాడి చేయడంతో సునీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి సమాచారం మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని, డీఎస్పీ విచారణ చేస్తారని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

జోరుగా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మధురపూడి: వైఎస్సార్ సీపీ రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజాకు ఓటు వేసి, అభివృద్ధికి మద్దతు పలకాలని పార్టీ నాయకుడు నీరుకొండ బాబ్జీ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం కోరుకొండలో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను ఉద్దేశించి బాబ్జీ మాట్లాడుతూ శ్రామికుల పక్షపాతిగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవడం ద్వారానే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. స్థానిక రాజరాజేశ్వరి ఆలయం, హైస్కూల్ సమీప ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్‌కుమార్, పార్టీ నాయకులు కేతినీడి అశోక్, తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, అయిల రామకృష్ణ, చంటిరెడ్డి, కటకం బాబ్జీ, కాలచర్ల శ్రీను, వరదానం, ఆర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

సాగుకు యంత్ర సాయం

- పండగలా మారిన వ్యవసాయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



ట్రాక్టర్ అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా (ఫైల్)

రాజానగరం: వ్యవసాయం అంటేనే నిరంతరం శ్రమించడం. ఏమాత్రం విశ్రమించినా పెట్టిన పెట్టుబడులను కూడా తిరిగి పొందలేని పరిస్థితులు ఏర్పడతాయి. అందుకనే వ్యవసాయాన్ని కత్తిమీద సాము వంటిది అంటారు. అటువంటి వ్యవసాయ రంగంలో రైతుల పడే శ్రమ వర్ణనాతీతం. ఆరుగాలం శ్రమిస్తూ పంటలు పండించే రైతన్నల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి ప్రభుత్వం అనేక రకాల పథకాలను అమలు చేస్తోంది. వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా రైతుల ఆర్థిక, సామాజిక భద్రతతో పాటు అవసరమైన యంత్రాలను వ్యవసాయ గ్రూపులకు అందజేస్తోంది.

నిరంతర శ్రమ

నాగలితో దుక్కు చేసి, పారలతో దమ్ము చేసి, నార్లు పోసి, కూలీలతో నాట్లు వేయించి, నిరంతరం పంటను పరిశీలిస్తూ, చీడపీడల బెడద లేకుండా కాసుకుంటూ, పంట పక్వానికొచ్చిన తరువాత కూలీలతో కోయించి, బల్లకేసి కొట్టి, ధాన్యం గింజలను కళ్లాలలో ఆరబెట్టించి, బస్తాలకు ఎత్తించి, విక్రయించే వరకు అన్నదాతలు శ్రమిస్తూనే ఉంటారు. ఈ విధంగా పడే శ్రమతో పాటు పెట్టుబడులు కూడా అధికంగానే పెట్టాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో వారికి యంత్రాల సాయాన్ని అందిస్తే, సాగులో విప్లవాన్ని తీసుకువస్తారని జగనన్న ప్రభుత్వం ఆలోచన చేసింది. గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయంలో యాంత్రీకరణను తీసుకువచ్చేందుకు కార్యాచరణ రూపొందించింది. స్వయం సహాయక సంఘాల మాదిరిగానే రైతులతో గ్రూపులుగా ఏర్పాటు చేసి, సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందిస్తుంది. వీటిని మిగిలిన రైతులకు అద్దెకు ఇచ్చుకుంటూ ఆయా గ్రూపులు ఆర్థికంగా నిలదొక్కునే అవకాశం కల్పించింది.

40 శాతం సబ్సిడీపై 60 ట్రాక్టర్ల పంపిణీ

ప్రభుత్వ అమలు చేసే ప్రతి పథకం ద్వారా నియోజకవర్గంలో సాధ్యమైనంత వరకు ఎక్కువ మందికి ప్రయోజనం చేకూర్చాలనే తలంపుతో పని చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఈ పథకాన్ని కూడా విస్తృతంగా వినియోగించేలా కృషి చేశారు. రాజానగరం నియోజకవర్గంలో ఏర్పడిన 60 రైతు గ్రూపులకు, ఒక్కో గ్రూపునకు ఒకటి యూనిట్ చొప్పున 60 ట్రాక్టర్లను అందజేశారు. ఒక్కొక్క ట్రాక్టర్ ఖరీదు రూ.8 లక్షలు కాగా అందులో 40 శాతం సబ్సిడీగా లభిస్తుంది.



యంత్ర సాయంతో కోస్తున్న వరి పంట(ఫైల్)

వరికోత మెషీన్ల మంజూరు

వరి కోతల సమయంలో కూలీలు అందుబాటులో లేకపోవడం ఒక సమస్య అయితే, ఒక్కోసారి పంట పనలపైనే ఉండగా అకాల వర్షం కారణంగా ధాన్యం తడిసిపోతుండడం మరో పరిస్థితి. దీని నివారణకు వరికోత మెషీన్ల సహాయంతో ఎకరం పంటను రెండు గంటల్లోపులోనే ఒబ్బిడి చేసుకునే అవకాశం ఉంది. దీన్ని గుర్తించి రైతులకు వరికోత మెషీన్లను సబ్సిడీపై అందించారు. వరికోత మెషీన్ వ్యయం రూ.25 లక్షలు, దానిలో రూ.10 లక్షల సబ్సిడీ ఇచ్చి రైతులకు మంజూరు చేశారు. అలాగే సుమారు 100 గ్రూపులకు కల్టివేటర్, రోటోవేటర్లు అందించారు.

విత్తన శుద్ధికి ఉత్తమ ర్యాంకు

ఖరీఫ్, రబీ సమయంలో రైతులు కేళీ విత్తనాలు, నకిలీ ఎరువులతో నష్టపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ పరిస్థితిలో తాము పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాక అప్పుల పాలైన రైతులు ఎందరో ఉన్నారు. దీన్ని నివారించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువుల నాణ్యతను నేరుగా పరీక్షించుకునేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. రైతులు ఉచితంగా ఈ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరీక్షించుకోవచ్చు. డీలర్లు సైతం తక్కువ మొత్తంతో విత్తనాలు, ఎరువులను పరీక్షించుకునే వీలుంటుంది. రాజానగరం నియోజకవర్గంలో రైతులకు అందుబాటులో ఉండేలా కోరుకొండలో ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఏర్పాటు చేశారు. రూ.1.67 కోట్లతో ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్ నిర్మించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ల్యాబ్ ద్వారా విత్తనాలు, ఎరువులను పరీక్షించగా రాష్ట్రంలోనే కోరుకొండ అగ్రికల్చర్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌కు ఉత్తమ ర్యాంకు లభించడం గర్వించదగిన విషయం.

‘ఖేలో’ పనులను పరిశీలించిన కమిటీ



వీసీ ఆచార్య పద్మరాజుతో సమావేశమైన కమిటీ సభ్యులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో చేపట్టిన ఖేలో ఇండియా ప్రాజెక్టు పనులను మానిటరింగ్ కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో రూ. 8.30 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కమిటీ చైర్మన్ పి.రామకృష్ణ (స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఏపీ), సభ్యులుగా యువజన, క్రీడా మంత్రిత్వ శాఖకు చెందిన రజత్ చౌహాన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధి పి.సతీష్‌కుమార్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ ప్రతినిధి ఎస్‌వీ రమణ, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇంజినీర్ కె.నూకరత్నం ఆయా పనులను పరిశీలించారు. అనంతరం వీసీ ఆచార్య కె.పద్మరాజుతో సమావేశమై, పనుల ప్రగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ డీఎం ఎం.శేషగిరి, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి 6 గంటల వరకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

నిరాడంబరంగా సత్తి సూర్యనారాయణరెడ్డి నామినేషన్

- మరోసారి జగన్ సీఎం కావాలి : ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

అనపర్తి: వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ అభ్యర్థిగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నిరాడంబరంగా తన నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా నియోజకవర్గంలోని బిక్కవోలులో గల లక్ష్మీగణపతి స్వామిని, పెదపూడి మండలం గొల్లలమామిడాడలో గల శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామి వార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అనపర్తి చేరుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి అనపర్తిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ ఎం.మాధురికి అందజేశారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిరాడంబరంగా, ఆర్భాటాలు లేకుండా కేవలం ఐదుగురు కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే తన నామినేషన్ దాఖలు చేశారు.

ఏడో రోజు మూడు నామినేషన్లు

ఇలావుండగా ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మితో పాటు, బీఎస్పీ అభ్యర్థిగా కొల్లం శ్రీనులు బుధవారం నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్‌ఓ కార్యాలయ వర్గాలు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం చివరి దశకు చేరిందని, ఏడో రోజు బుధవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావటం ఖాయమని వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ పూర్తి పారదర్శకంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. అంతకు ముందుగా పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే దంపతులను పార్టీ గుర్తుతో తయారు చేసిన గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నేత్రవైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, ప్రముఖ న్యాయవాది వీవీఆర్ సుబ్రహ్మణ్యం, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, ఆర్కే ఎగ్స్ అధినేత తేతలి రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఏఎంసీ డైరక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- టీడీపీ, జనసేన నేతలు వైఎస్సార్ సీపీలో చేరిక



శ్రీరంగపట్నంలో శ్రీనివాస్, నానిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: అభివృద్ధికి కేరాఫ్‌గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండగా, దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా చంద్రబాబు కూటమి ఉందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో టీడీపీ నాయకుడు కర్రి శ్రీనివాస్, జనసేన నాయకుడు చందం నాని వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి, వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీల కార్యాలయాలుగా నేతల్లేక ఖాళీగా మారనున్నాయన్నారు. వాటికి తాళాలు వేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కుట్రలు, మోసాలతో ఆయా పార్టీల నాయకులు పనిచేస్తున్నారన్నారు. ఐదేళ్ల పాలనలో ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాదరణ పెరిగిందని, దాన్ని ఓర్వలేకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం చేయించారని ఆరోపించారు. టీడీపీ నాయకుల ప్రోద్బలంతో జరిగిన ఈ ఘటనను మసిపూసేందుకు యత్నించడం దారుణమన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ సీపీకి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సూరిశెట్టి కుటుంబరావు, దాడి శివాజీ, దాడి వీరబాబు, రాంబాబు, కేఆర్‌జే రాజేష్, ఎంపీటీసీ నూకరాజు పాల్గొన్నారు.

యాక్సిడెంట్ కేసుల్లో పరిహారంపై సమావేశం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షతన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రెవెన్యూ, పోలీసులు అధికారులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు.

ఎన్నో అభివృద్ధి పనులు చేశా

- మరోసారి అవకాశమివ్వండి
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జక్కంపూడి రాజా



చినకొండేపూడిలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు



వంగలపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

సీతానగరం: నియోజకవర్గంలో ఎన్నో కీలక అభివృద్ధి పనులు చేశామని, మరోసారి అవకాశమిస్తే మరింత ప్రగతి సాధిస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం సీతానగరం, చినకొండేపూడిల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ నవరత్న పథకాలను పార్టీలకు, కులమతాలకు అతీతంగా పేదలకు అందించామని తెలిపారు. చినకొండేపూడిలో రూ 1.50 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం, మరో రూ.50 లక్షలతో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. రఘుదేవపురంలో రూ.8 కోట్లతో 30 పడకల సీహెచ్‌సీ నిర్మిస్తున్నట్టు చెప్పారు. సీతానగరం, కోరుకొండ మండలాల్లో 25 వేల ఎకరాలను ముంపు సమస్య నుంచి గట్టెక్కించడానికి రూ.91 కోట్లతో రివర్స్ పంపింగ్ స్కీం మంజూరు చేయించామన్నారు. మూడు మండలాల్లో చెరువులు, కాలువల అభివృద్ధి, కల్వర్టులు, తూములు, వంతెనల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. రూ.22 కోట్లతో చేపట్టిన తొర్రిగడ్డ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం అభివృద్ధి పనులు 50 శాతం పూర్తయ్యాయని చెప్పారు. మరోసారి వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టేలా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీలు ముదునూరి సురేష్‌రాజు, సత్యం మదన్‌బాబు, కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, సర్పంచ్‌లు చెరుకూరి శ్రీనివాస్, కోండ్రపు ముత్యాలు, ఉప సర్పంచ్‌లు సత్తిపండు రాజు, ద్వారంపూడి రామకృష్ణ, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ పెండ్యుర్తి దేవదాసు, మణిరాజు, ముదునూరి రామకృష్ణంరాజు, పోలినాటి రామచంద్రబాబు, పోలినాటి ఈశ్వరుడు, వలవల వల్లీ, వలవల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే జగనన్న అజెండా: డాక్టర్ రాజశ్రీ

రాష్ట్రంలో మరోసారి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు జేజేలు పలుకుతారని, అభివృద్ధి, సంక్షేమమే జగనన్న అజెండా అని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. వంగలపూడిలో పార్టీ నేతలతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి, మహిళలకు బొట్టు పెట్టి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.1,773 కోట్లతో అభివృద్ధి, రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించినట్టు చెప్పారు. ప్రజలు గత ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికీ మధ్య వ్యత్యాసం గమనించాలన్నారు. సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, పార్టీ నాయకులు రంధి భారతీదేవి, రంధి సుధాకర్, కొంచ భాస్కరరావు, ముత్యం శ్రీనివాస్, పేరిచర్ల శ్రీనివాసరాజు, బొబ్బిలి రాజేష్, కాజా వీర్రాజు, కూచిపూడి అబ్బులు, తిర్నాతి చిన్న, తిర్నాతి సుధ, పులప స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జక్కంపూడి పరామర్శలు

రాజానగరం: నియోజకవర్గంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా బుధవారం పరామర్శించారు. మాతృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు మేడా గురుదత్త ప్రసాద్‌ను పరామర్శించి, సానుభూతి తెలిపారు. రాజానగరం, నరేంద్రపురంల్లో కుమారుల మరణంతో బాధపడుతున్న చల్లా శ్రీనును, దాకవరపు చంద్రరావును పరామర్శించారు. ఇటీవల మరణించిన నరేంద్రపురానికి చెందిన శివాజీ, పిల్లి వనమయ్య, పైన నూకరాజు కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. చక్రద్వారబంధంలో ప్రగడ నాగభూషణం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సూర్యదేవుడిని దర్శించిన ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు



జి.మామిడాడ సూర్యదేవాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు



పుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో కూర్చున్న ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: ముఖ్యమంత్రి జగన్ అందించిన సంక్షేమ పథకాలు, అనపర్తి నియోజకవర్గ ప్రజలు అందించిన తోడ్పాటు, తాను చేసిన అభివృద్ధితో మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో విజయం తథ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన, సతీమణి ఆదిలక్ష్మి బుధవారం అనపర్తిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసే సందర్భంగా ముందుగా జి.మామిడాడలో సూర్యనారాయణమూర్తి స్వామి, పుట్టకొండలో లక్ష్మి నరసింహస్వామి ఆలయాల్లో స్వామి వారిని దర్శించుకున్నారు. కొంత సేపు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారికి ఆ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా 55,208 ఓట్లు భారీ మెజార్టీతో రాష్ట్రంలో నాలుగు స్థానంలో నిలిచానన్నారు. అయితే నియోజకవర్గ ప్రజలు అందిస్తున్న దీవెనలు, మద్దతుతో జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అంతకు మించి రికార్డు స్థాయి మెజార్టీతో జగన్‌కు కానుక అందజేస్తానన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు కర్రి శ్రీవెంకటరెడ్డి, మండ రాజారెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి, వల్లు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.